అపోలో లాభం రూ. 372 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10:అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.372 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది సంస్థ. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.245 కోట్ల లాభంతో పోలిస్తే 52 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.4,851 కోట్ల నుంచి రూ.5,527 కోట్లకు ఎగబాకింది. వచ్చే మూడు నుంచి నాలుగేండ్లకాలంలో కొత్తగా 11 ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా కొత్తగా 3,512 పడకలు జతకానున్నాయని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. ముంబై నుంచి వారణాసి, చెన్నై నుంచి గురుగ్రామ్ వరకు ఉత్తమ వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.9 లేదా 180 శాతం మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

PATANJALI
PATANJALI FOODS LIMITED
(formerly known as Ruchi Soya Industries Limited)

పతంజలి ఫుడ్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.370.93 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది పతంజలి ఫుడ్స్ లిమిటెడ్. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.216.54 కోట్ల లాభంతో పోలిస్తే 71.29 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం కూడా రూ.7,910.70 కోట్ల నుంచి రూ.9,103.13 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. నిర్వహణ ఖర్చులు కూడా రూ.8,652.53 కోట్లకు ఎగబాకాయి

గోల్డ్ హై జంప్

ఒక్కరోజే రూ.2,430 ఎగిసిన తులం ధర

ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.88,500కు చేరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: బంగారం ధరలు భారీగా పెరిగాయి. ఆల్‌టైమ్ హైలో స్థిరపడ్డాయి. సోమవారం ఒక్కరోజే దేశీయ మార్కెట్‌లో దాదాపు రెండున్నర వేలు పుంజుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. స్టాక్, ఫారెక్స్ మార్కెట్లతోపాటు బులియన్ మార్కెట్‌నూ షేక్ చేసేశాయి మరి. ఈ క్రమంలోనే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర రూ.2,430 ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా రూ.88,500ను తాకింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

ఇదీ సంగతి..

అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేస్తామని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు కుదేలవగా.. బంగారం, వెండి తదితర కమోడిటీ మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఈ నేపథ్యంలోనే స్పాట్ మార్కెట్లలో ఔన్స్ గోల్డ్ విలువ 3,000 డాలర్లు పలికినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక సిల్వర్ ఔన్స్ 32.76 డాలర్లను చేరింది. ఈ ట్రెండ్ దెబ్బకు భారతీయ మార్కెట్లలోనూ హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కనిపించింది. ఫలితంగా ఒక్కసారిగా రేట్లు పైపైకి పోయాయి. నిజానికి గతకొద్ది రోజులుగా గోల్డ్ మార్కెట్ దూకుడు మీదనే ఉన్నది. స్టాక్ మార్కెట్ల ఒడుదొడుకుల నడుమ ఇన్వెస్టర్లు.. సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపే అడుగులు వేస్తున్నారు. అయితే ట్రంప్ దుందుడుకు నిర్ణయాలతో వాణిజ్య యుద్ధానికి అవకాశాలుండటంతో పుత్తడి ధరలు రాబోయే రోజుల్లో మరింత పెరిగే వీలే ఉన్నదంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. దీంతో మదుపరులు గోల్డ్‌పై ఇంకా ఇన్వెస్ట్‌మెంట్లు పెట్టవచ్చని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే సరికొత్త శిఖరాలను ధర లు అధిరోహించడం ఖాయమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి ప్పుడు.



హైదరాబాద్‌లో..

దేశ రాజధానిలో ధరలతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్‌లో రేట్లు ఒకింత స్థిరంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. తులం 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.87,060గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పసిడి ధర రూ.79,800గా నమోదైంది. గతంతో పోల్చితే వరుసగా రూ.390, రూ.350 చొప్పున పెరిగాయి. ఇక ఢిల్లీలో కిలో వెండి ధర రూ.97,500గా ఉన్నది. మునుపటితో చూస్తే రూ.1,000 పెరిగింది. ఇక ఎంసీఎక్స్‌పై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్‌కుగాను 10 గ్రాములు రూ.940 పెరిగి రూ. 85,828గా నమోదైంది. జూన్‌కు రూ.1,015 ఎగిసి రూ.86,636గా ఉన్నది.

రికార్డు స్థాయిలో 2,900 డాలర్లు పలికింది. కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లోనూ రూ.2,932.69 డాలర్లుగా ట్రేడైంది. త్వరలోనే

త్వరలో తులం లక్ష?

బంగారం ధరలు పెరుగుతున్న తీరును చూస్తే తులం లక్ష రూపాయలను తాకే సమయం ఎంతో దూరంలో లేదనిపిస్తున్నది. రేపటి రోజుల్లో పసిడి ధరలు మరింత పెరుగుతాయంటున్న మార్కెట్ నిపుణులు.. ఈ ఏడాది చివర్లో దేశీయ విపణిలోనే 10 గ్రాములు లక్ష రూపాయల మార్కును తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్తున్నారు మరి. అయితే గ్లోబల్ మార్కెట్‌లోనూ ఔన్స్ 2,900 డాలర్ల మార్కును దాటడం ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నది. మొత్తానికి ఈ ఏడాది ధరల స్థిరీకరణకు అవకాశాలు తక్కువేనన్న మాట మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ నుంచి వినిపిస్తున్నది.

రిలయన్స్ స్పోర్ట్ ఎడ్రింక్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:రిలయన్స్ గ్రూపునకు చెందిన రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ తాజాగా స్పోర్ట్స్ హైడ్రేషన్ డ్రింక్ సెగ్మెంట్‌లోకి ప్రవేశించింది. ప్రముఖ శ్రీలంక క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్‌తో కలిసి స్పిన్నర్ పేరుతో ఈ డ్రింక్‌లను మార్కెట్లోకి విడుదల ఏసింది. ఇప్పటికే కంపా కొలా పేరుతో కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న సంస్థ తాజాగా విడుదల చేసిన 150 ఎంఎల్ సింగిల్-సర్వ్ బాటిల్ కలిగిన స్పోర్ట్స్ డ్రింక్ ధర రూ.10గా నిర్ణయించింది. ఇతర పోటీ సంస్థలైన పెప్సీకో, కోకా-కోలాకు చెందిన స్పోర్ట్స్ డ్రింక్స్ కంటే తక్కువ ధరతో విడుదల చేయడం విశేషం.

టాటా బోయింగ్ 300వ ఫ్యూజ్‌లేజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10: టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ హైదరాబాద్ యూనిట్ నుంచి ఏహెచ్-64 అపాచీ అటాక్ హెలికాప్టర్ కోసం మరో బాడీని డెలివరీ చేసింది. ఈ ఫ్యూజ్‌లెజ్ 300వది కావడం విశేషం. ఇక ఈ హెలికాప్టర్లను అమెరికా ఆర్మీతోపాటు భారత ఆర్మీ కూడా వినియోగిస్తున్నది. దేశీయ ఎయిర్‌పోర్స్ 22 ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లను కలిగివున్నది. బోయింగ్, టీఏఎస్ఎల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో 900 మంది ఇంజినీర్లు, టెక్నీషన్లు ఉన్నారు. 14 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో తయారైన ఉత్పత్తులు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతున్నాయి.

ట్రంప్ టారీఫ్‌ల దెబ్బ

సెన్సెక్స్ 548, నిఫ్టీ 178 పాయింట్ల పతనం

ముంబై, ఫిబ్రవరి 10: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ భారీగా నష్టపోయాయి. అమెరికా దిగుమతి చేసుకునే అల్యూమినియం, స్టీల్‌పై 25 శాతం సుంకం విధిస్తామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మార్కెట్లపై పిడుగుపడ్డట్టు అయింది. మదుపరుల్లో నమ్మకం సడలడంతో అమ్మకాల బటన్ నొక్కారు. బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు బ్యాంకింగ్, మెటల్, చమురు రంగ షేర్లు కుదేలవడం సూచీల పతనానికి ఆజ్యంపోసింది. ఇంట్రాడేలో 750 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 548 పాయింట్లు నష్టపోయి 77,311.80 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 178.35 పాయింట్లు కోల్పోయి 23,381.60 వద్ద స్థిరపడింది. అమెరికా టారిఫ్ భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని, దేశీయ మదుపరులు తమ పెట్టుబడులను ఈక్విటీల నుంచి సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా పతనానికి పరోక్షంగా కారణమయ్యాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

టాప్ లూజర్‌గా పవర్‌గ్రిడ్

నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో పవర్‌గ్రిడ్ షేరు భారీగా పతనం చెందింది. ఒక దశలో నాలుగు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3.45 శాతం నష్టంతో రూ.268.70 వద్ద ముగిసింది. దీంతోపాటు టాటా స్టీల్, జొమాటో, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ షేర్లు కూడా రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. అలాగే మహీంద్రా, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, రిలయన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి. వీటితోపాటు సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లె, ఎస్బీఐ షేర్లు పతనం చెందాయి. కానీ, కొటక్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 2.25 శాతం తగ్గగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.06 శాతం క్షీణించాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 2.69 శాతం నష్టపోగా, మెటల్ 2.63 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 2.61 శాతం, యుటిలిటీ 2.49 శాతం దిగువకు పడిపోయాయి.

నష్టాలకు కారణాలు ఇవే

- అమెరికా దిగుమతి చేసుకునే స్టీల్, అల్యూమినియంపై 25 శాతం సుంకాల ప్రకటన
- దేశీయ మార్కెట్లో విదేశీ మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం
- రూపాయితో పోలిస్తే డాలర్ మరింత బలపడటం
- దేశీయ కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు

నాలుగు రోజుల్లో 7.68 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతుండటంతో లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద కరిగిపోతున్నది. ఎఫ్ ఐఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, కొత్తగా టారిఫ్ యుద్ధానికి ట్రంప్ తెరలేపడంతో గత నాలుగు సెషన్లలో మదుపరులు రూ.7.68 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో నమోదిత సంస్థల విలువ రూ.7,68,252.32 కోట్లు కరిగిపోయి రూ.4,17,82,573.79 కోట్లకు చేరింది.

88 దగ్గరదాకా..

ఆఖర్లో కోలుకున్న రూపాయి • 5 పైసలు పెరిగి 87.45 వద్ద ముగింపు

ముంబై, ఫిబ్రవరి 10: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. ఒకానొక దశలో 50 పైసలు క్షీణించి 88 దరిదాపుల్లోకి దిగజారింది. ఆల్‌టైమ్ ఇంట్రా-డే కనిష్ఠాన్ని తాకుతూ 87.95 స్థాయిని చేరింది. అయితే ఆఖర్లో కోలుకున్నది. ఈ క్రమంలోనే చివరకు 5 పైసలు లాభపడి 87.45 వద్ద ముగిసింది. శుక్రవారం 87.50 దగ్గర ఆగిన విషయం తెలిసిందే. కానీ అంతకుముందు రోజు గురువారం మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి పడిపోయి ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో తాజా లాభాలతో వరుసగా రెండు రోజుల ట్రేడింగ్‌లో 14 పైసలు లాభపడినట్టైంది. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేయడం డాలర్‌ను బలపర్చింది. అమెరికాపై

పరస్పర సుంకాలతో బదులిస్తున్న దేశాలపై ప్రతీకార సుంకాలకూ ట్రంప్ దిగుతున్నారు. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందేమోనన్న భయాలు ఇప్పుడు వెంటాడుతున్నాయి. ఈ అంచనాలు కూడా రూపీని బలహీనపరుస్తున్నాయన్న అభిప్రాయాలు ఫారెక్స్ మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

రిక్తమ్ ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ సేవలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10: హైదరాబాద్ ఆధారిత రిక్తమ్ గ్రూపు తాజాగా కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారంగా ఇంటర్వ్యూ సేవలు అందించే టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. మానవ వనరుల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంలో సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసినట్లు ఇంటర్వ్యూ ఏఐ కో-ఫౌండర్, సీఈవో సిద్ధరామ్ శింగిషెట్టి తెలిపారు. ఈ సేవలతో ఇంటర్వ్యూ మరింత సులభతరం కానున్నదని, అలాగే సమయం ఆదా కానున్నదని ఆయన చెప్పారు.

నేతకానీలను విమర్శిస్తే ఊరుకునేది లేదు

మందమర్రి, ఫిబ్రవరి 10 : నేతకాని కులస్తులను విమర్శిస్తే ఊరుకునేది లేదని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్ల రాజమల్లు, జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు స్పష్టం చేశారు. మందమర్రి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాల సంఘం నాయకులు నేతకాని కులస్తులను తక్కువ చేసి విమర్శించడం సరైన విధానం కాదన్నారు. చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే నియోజకవర్గాలతో పాటు, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని నేతకాని కులస్తుల ఓట్లతో కాంగ్రెస్ నాయకులు పదవులు పొందారని పేర్కొన్నారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడితో పాటు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను విమర్శించే స్థాయి వారికి లేదన్నారు. మహిళా ఉపాధ్యక్షురాలు గోలేటి లక్ష్మి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి యువరాజ్, ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, మండల నాయకుడు దుర్గం రాజయ్య పాల్గొన్నారు.

ఓటరు ముసాయిదా ప్రదర్శన

హాజీపూర్/కాసిపేట/కౌటాల/తిర్యాణి, ఫిబ్రవరి 10 : హాజీపూర్, కాసిపేట, కౌటాల, తిర్యాణి మండలాల్లోని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఎన్నికల సందర్భంగా ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం ఓటరు జాబితా ముసాయిదాను అధికారులు ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో హాజీపూర్ సీనియర్ అసిస్టెంట్ కొండయ్య కాసిపేట, కౌటాల, తిర్యాణి మండలాల ఎంపీడీవోలు సత్యనారాయణ సింగ్, కోట ప్రసాద్, వేముల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్, పెన్షన్ రాక ఇబ్బందులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 10 : సింగరేణిలో 11వ వేజ్ బోర్డులో విరమణ పొందిన కార్మికులకు ఏరియర్స్, పెన్షన్ చెల్లించాలని, వారు ఇబ్బందులు పడుతున్నారని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్‌తో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. నవంబర్, డిసెంబర్‌లో బయోమెట్రిక్ విధానం ద్వారా జీవన్ ప్రమాణ్, మెడికల్ కార్డులు రెన్యూవల్ చేసుకోవడంలో చిన్న చిన్న తప్పుల వల్ల పెన్షన్ పొందలేకపోతున్నారని, అలాగే మెడికల్ సౌకర్యం కూడా పొందలేకపోతున్నారని తెలిపారు. రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర సంయుక్త కార్యదర్శి పానగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజర్ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 : రిటైర్డ్ కార్మికులకు రూ.20 లక్షల గ్రాడ్యూటీ చెల్లించాలని టీఎనీటయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. కార్యాలయంలో మాట్లాడారు. డబ్ల్యూసీలో గ్రాడ్యూటీపై కోర్టులో కేసు నమోదైందని పేర్కొన్నారు. నాయకులు ఆవాల మధుసూదన్ రెడ్డి, మేకల రాజయ్య, బుల్లు సత్తయ్య, దాగం పోశం, ఆవులూరి ఓదెలు, తాహెర్ ఖాన్, ఎదులూరి ఓదెలు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

కోటపల్లి, ఫిబ్రవరి 10 : గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్న కోటపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని గుగ్లోత్ రుచిత, ఆమె తల్లిదండ్రులు లలితా-దేశ్యానాయక్‌ను సోమవారం ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు సన్మానించారు. మోడల్ స్కూల్‌లో చదివిన రుచిత పరేడ్‌లో పాల్గొనడం గర్వకారణమని పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 10 : అమృతహస్తం వెల్ఫేర్ సొసైటీ వృద్ధుల వికలాంగుల ఆశ్రమంలో మంచిర్యాల మహిళా తరంగిణి మమత ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. అధ్యక్షురాలు మంజులకృష్ణారావు ఫోర్ బర్నర్ స్టవ్‌ను అందించారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లత, వందనపు నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

భీమారం, ఫిబ్రవరి 10 : కొత్తపల్లి శివారు ప్రాంతంలోని వరి క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ సందర్శించి, రైతులకకు అవగాహన కల్పించారు. వరి కాండం తొలుచు పురుగుతోపాటు, పొలాల్లో చౌడు కూడా గమనించి, పరిష్కార చర్యలు వివరించారు. ఏఈవో అరుణ్ కుమార్, రైతులు కలగూర లింగయ్య, కలగూర వెంకటి, కలగూర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్లు పూర్తయ్యేనా..!

- ఏడాది గడిచినా పూర్తికాని పనులు
- మందమర్రి బస్టాండ్‌లో ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులు

మందమర్రి, ఫిబ్రవరి 10 : మందమర్రి పట్టణంలోని మార్కెట్‌లో గల ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో టాయిలెట్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రజల సౌకర్యార్థం గతేడాది గతేడాది జనవరి 21న చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ శంఖుస్థాపన చేసి పనులు ప్రారంభించగా, ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోకుండా పోయింది. శంకుస్థాపన సమయంలో మూడునెలల్లో పూర్తిచేస్తామని చెప్పిన ఎమ్మెల్యే.. అనంతరం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పట్టణ ప్రజలు, ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తి

మందమర్రి మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్‌లో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్లు

నెలకొన్నది. నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు, వివిధ అవసరాలపై మార్కెట్‌కు వచ్చే వారు, చిరు వ్యాపారులు పబ్లిక్ టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణం పూర్తయితే సమస్య పరిష్కారమవుతుందని ఆశించిన తమకు నిరాశే మిగిలిందని ప్రజలు, ప్రయాణికులు అంటున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొట్టమొదటి కార్యక్రమంలో భాగంగా ఈ పనులకు శంకుస్థాపన చేయగా, మొదటి పనే పర్తికాకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టాయిలెట్ నిర్మాణం పనులను పూర్తి చేయాలి..

మందమర్రి మార్కెట్ బస్ స్టేషన్ ఆవరణలో ఎమ్మెల్యే వివేక్ గతేడాది శంఖుస్థాపన చేసిన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న టాయిలెట్లను సోమవారం ఆయన పరిశీలించారు.

సింగరేణిలో డైరెక్టర్ల నియామకం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 10 : సింగరేణిలో ఖాళీగా ఉన్న నాలుగు డైరెక్టర్ పోస్టుల్లో సోమవారం రెండు పోస్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నియమించాయి. సింగరేణిలో సీఎండీ(ఐఏఎస్)ను, డైరెక్టర్ (ఫైనాన్స్)ను ఏఐఎస్‌లను.., మిగిలిన డైరెక్టర్లను సింగరేణిలోని అనుభవం గల సర్వీస్ జీఎంల నుంచి నియమిస్తారు. కొంత కాలంగా ఖాళీగా ఉన్న డైరెక్టర్ (పీపీ, ఆపరేషన్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 10 మంది జీఎంలను ఇంటర్వ్యూలకు పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర కోలిండియా చీఫ్ సెక్రటరీలు, సీఎండీ, కోల్‌సెక్టార్ ఉన్నతాధికారులతో కూడిన కమిటీ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ మేరకు శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణను డైరెక్టర్ (పీపీ)గా, రామగుండం ఆర్జీ-3 ఆడ్రియాల జీఎం కొప్పుల వెంకటేశ్వర్లును డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమించారు. సింగరేణిలో డైరెక్టర్ల సంఖ్య నలుగురికి చేరింది. డైరెక్టర్ (పా), డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీఎండీ బలరాం డైరెక్టర్ (ఫైనాన్స్, పా) గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

డైరెక్టర్ (పీపీ) సూర్యనారాయణ

డైరెక్టర్(ఆపరేషన్) వెంకటేశ్వర్లు

బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ

నస్పూర్, ఫిబ్రవరి 10 : కొత్తగూడెంలో 6 నుంచి 9వ తేదీ వరకు జరిగిన పదో రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపినటుల జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్లూరి సుధాకర్ సోమవారం తెలిపారు. 75 ప్లస్ విభాగం సింగిల్స్‌లో మందమర్రికి చెందిన పల్లెం రాజలింగు విన్నర్‌గా, డబుల్స్‌లో వరంగల్ క్రీడాకారుడు, రిటైర్డ్ డీఎస్పీ నరసయ్యతో కలిసి పాల్గొని విన్నర్‌గా నిలిచాడు. అలాగే 35 ప్లస్ విభాగం మిక్స్‌డ్ డబుల్స్‌లో మంచిర్యాల

ఐటీడీఏ పీవో రాహుల్ చేతుల మీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్ అందుకుంటున్న క్రీడాకారులు

జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారుడు, సికింద్రాబాద్‌లోని డిఫెన్స్ ఫెన్షన్ విభాగంలో పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి హర్షవర్ధన్.. హైదరాబాద్ క్రీడాకారిణి ప్రశాంతితో కలిసి రన్నర్‌గా నిలిచినట్లు వివరించారు. వీరికి భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ట్రోఫీతో పాటు, సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముకేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి అభినందించారు. రాజలింగు, హర్షవర్ధన్ మార్చిలో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మాట్లాడుతున్న ఆర్‌జేడీ త్యనారాయణ రెడ్డి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 10 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక రాజేంద్ర ప్రసాద్ బీఎడ్ కళాశాలలో సోమవారం డీఈవో గమన్యూయెల్ అధ్యక్షతన ఎంఈవోలు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి అత్యధికంగా 10 జీపీఏ సాధించేలా కృషిచేయాలన్నారు. జిల్లాలోని నలుగురు కోఆర్డినేటర్లు పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల అధికారి ఉదయ్ బాబు, ఫైనాన్స్ అకౌంటెంట్ అధికారి దేవాజి, కో ఆర్డినేటర్ మధూకర్, అబిద్ అలీ, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

రామ చిలుకల వలె కనిపిస్తున్న పుష్పాలు

రామచిలుక